
# కనికరించని అదృష్టం

బుద్ధియజ్ఞమూర్తి

ఉదయం పూట పది గంటలవుతున్నది. సోమసుందర్ ముఖంలో దిగులు కన్పిస్తున్నది. జేబులో మిగిలింది అర్థరూపాయే. యాభై రూపాయలు జేబులో వుండటానికి, లేకుండా పోవటానికి తేడా నిమిషమే. అంతకు గంట క్రితం అతను యాభై రూపాయిలను లాటరీలో పెట్టి పోగొట్టుకున్నాడు. అదీ సింగిల్ నంబరు లాటరీలో. "డామిట్! ఇవాళ ఎవడి ముఖం ముందుగా చూశానో శంకరావు పంతులు గాడి వద్ద అప్పుగా తీసుకున్న యాభై రూపాయిలూ ఈ మాయదారి లాటరీలో కతం అయిపోయాయి. వెరీ బ్యాడ్. జేబులో కాస్త డబ్బులుంటే లోపల వున్నవాడు గోల పెట్టేస్తాడు. రాస్కెల్! వాణ్ణి అదుపులో పెట్టాలంటే కష్టమవుతున్నది. అయినా అంతరాత్మ గాడు గోలపెట్టేసినంత మాత్రం చేత నా 'మైండ్' గాడు ఏం చేస్తున్నట్టు? వాణ్ణని కూడా ఏం లాభంలే. అంతకు అంతా సంపాదిద్దామనుకుంటే వున్నదే ఊడ్చుకుపోయింది. మళ్ళీ జేబు కళకళగా వుండాలంటే...? యాభైకి వంద సంపాదించాలి ఎట్లానైనా" అనుకున్నాడు. కానీ కొద్ది నిమిషాల పాటు



ఏం చేయాలో తోచనే లేదు.

ఎదురుగా లాటరీ టిక్కెట్లను చూస్తుంటే బుద్ధి అటువైపే వెళుతున్నది. టిక్కెట్లు రా రమ్మంటున్నాయి. పోవాలంటే జేబులో పైసలు లేకుండా అయిపోయాయి. అప్పుగా మళ్ళీ ఎవణ్ణన్నా అడుగుదామనుకున్నా ఇచ్చేవాడు ఒక్కడూ కనిపించలేదు. "ఉండి కూడా లేవని అబద్ధం చెపుతారు వుండాకోరు వెధవలు. ఏమనుకుంటారో వీణ్ణి. ముందు ముందు 'మిలియనీర' యి ఒక్కోడి భరతం పడతాను. కుక్కల్లా నా వెంట పడేట్టు చేయనూ. అప్పడు తెలుస్తుంది ఈ సుందరం గాడి 'పవర్' ఏమిటో?" అనుకున్నాడు మళ్ళీ.

జేబులో వున్న అర్థరూపాయిని బయటకు తీసి ఎగరవేస్తూ వున్నాడు తెలిసినవాళ్ళు ఎవరైనా కనిపిస్తారేమో, తనని ఆదుకుంటారేమో అని ఆశగా రోడ్డు వంక చూస్తూ. లాభం లేకుండా పోయింది. "దురదృష్టం గాడు ఇంకా మనల్ని వదిలినట్టు లేదు" అనుకుంటూనే కాస్తంత దూరంలో వున్న రాజస్థాన్ టీ కొట్టువాడి దగ్గరకు నడిచాడు. కొట్టు వాడి పేరు హొలియా.

సోమసుందరం 'టీ' కోసం అక్కడికే వస్తుండడం వల్ల చనువు వుంది.

"మంచి స్ట్రాంగ్‌గా 'దమ్ చాయ్' కొట్టవోయ్ హోలియా" అన్నాడు సుందరం. సుందరం వాలకం కొద్దిగా అర్థం చేసుకున్నాడేమో "సారేందో దిగులుగా వుండినారు" అన్నాడతను గ్లాసులో టీ పోస్తూ.

ముందుగా అక్కడ వున్న మంచి నీళ్ళ గ్లాసుడు తాగి, హోలియా అందించిన 'టీ' గ్లాసును అందు కున్నాడు.

"దిగులేరా నాయనా! ఆ లాటరీ వాడికి ఉత్త పుణ్యాన యాభై సమ' ర్పించుకున్నాను. ఇవేళ జనం దగ్గర ఎంత డబ్బు లాగాడో వెధవ" అన్నాడు కసిగా సుందరం.

యాభై రూపాయలు సుందరంవి లాటరీలో పోయినాయంటే హోలి యాకి సంతోషం వేసింది. 'అంతే కావాలి వెధవకి' అనుకున్నాడు. పైకి మాత్రం జాలి కనపరుస్తూ "అరే! మీవేంటి యాభై పోటమేంటి... నేను నమ్మను సారూ" అన్నాడు.

## కోరి తీసుకున్న సంక్షేమ శాఖ:

పి.వి. నరసింహారావు మంత్రివర్గంలో మండలి వెంకటకృష్ణారావుకు మొదటి సారి మంత్రి పదవి లభించింది. ఏ శాఖ కావాలని ఆయనను ముఖ్యమంత్రి అడిగారు. తనకు సాంఘిక సంక్షేమ శాఖ ఇవ్వవలసిందని మండలి కోరారు.

"అదేమిటీ! ఆ శాఖను అందరూ వద్దంటారే, ఇంకా ముఖ్యమైన శాఖ మీకివ్వాలనుకున్నాను" అని పి. వి. అన్నారు.

ఆ శాఖకు తాను మంత్రిగా వుంటే పేద సాదలకు సహాయం చేయడానికి అవకాశం ఎక్కువగా వుంటుంది కనుక ఆ శాఖను కోరుకుంటున్నానని మండలి సమాధానమిచ్చారు. సాంఘిక సంక్షేమశాఖవారు ఏర్పాటుచేసిన ఒక సదస్సులో ప్రసంగిస్తున్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి పి.వి. ఈ సంగతిని బైటపెట్టి మండలివారి ఔదార్యాన్ని ప్రసంశించారు.

— జి. వెంకటరామారావు

"నిజంరా హోలియా! ఇవాళ అదృష్టం మన పక్షాన లేదు. ఆ లాటరీ వాడి వైపే వున్నట్లుంది. అయినా అదృ ష్టంని మనవైపు తిప్పకునే ఉపాయం వుందిలే" అన్నాడు ఆలోచిస్తున్నట్టు సుందరం.

"ఏందా ఉపాయం" అన్నాడు వాడు ఆసక్తిగా. కొట్లో వీళ్ళిద్దరూ కాక పని చేసేవాడు, పిల్లవాడు మాత్రం ఒకడు న్నాడు.


"పదకొండు గంటల లాటరీకి నెంబరు చేతికి చిక్కిందిలే. చేతిలో యాభై వుంటేనా ఎనిమిది రెట్లు నాలు గొందలు వొచ్చిపడతాయి... ఏం నీ దగ్గరేమైనా వున్నాయా?" అన్నాడు హోలియా వంక ఓరగా చూస్తూ.

'వీడు నాకే టోకరా ఇచ్చేట్లు వున్నాడు బద్మాష్' అనుకుని "నాకెందుకులే సారూ. ఆ లాటరీల గొడవ' అన్నాడు పైకి.

"అంత తేలిగ్గా తీసేస్తావేంటోయ్ లాటరీలను. ఆడడంలో ఎంత మాజా లేకపోతే ఇంత జనం ఎవంటే పడి ఛస్తున్నారనుకుంటున్నావు. చూస్తూనే వున్నావుగా కళ్ళెదురుగా" సుందరానికి విడవాలని లేదు.

"అందుకే గద! కొంపలు కొల్లేరు చేసేసుకుంటున్నారు. ఇంటి లోన పెళ్ళాం, పిల్లలు ఎట్ల నున్నా ఫర్వాలేదు గానీ డబ్బంతా దీనికి తగల బెట్టేస్తా వుంటారు" అన్నాడు హోలియా. పదేళ్ళ నుండీ వుండడం వల్ల వాడికి తెలుగుభాషా నైపుణ్యం ఇక్కడి వాళ్ళకి వున్నట్లుగానే అబ్బింది.

"అమ్మో! వీడు కూడా నీతులు చెప్తే కాడికొచ్చాడు వెధవ' అనుకుని తల పక్కకి తిప్పేసరికి కుమార్ అగుపించాడు అటు వేపే వస్తూ. ఉసూరుమంటున్న ప్రాణం ఒక్కమా రుగా లేచి వచ్చినట్లయ్యింది. కష్ట సమయంలో ఆదుకోవడంలో కుమా ర్‌ని మంచినవాడు మరొకడు లేడని సోమసుందరానికి బాగా తెలుసు. ఇది వరలో తనకు అడగ్గానే అప్పు ఇచ్చాడు కూడా.



కుమార్ తన దాకా వచ్చేవరకు ఆగకుండా తనే ఎదురు వెళ్ళి కలుసుకున్నాడు. అర్జంటుగా రైల్వేస్టేషన్‌కు వెడుతున్నానని చెప్పాడు కుమార్. ఎందుకని సుందరం అతడిని ప్రశ్నించాడు. "మా బాబాయి విజయవాడ నుండి 'హౌరా'కు వస్తున్నాడు" చెప్పాడు కుమార్.

"అరే! హౌరా గంట లేటు" నోటికొచ్చింది చెప్పాడు సుందరం.

"అలాగా" అని కుమారే హోలియా టీ కొట్టు వద్దకి నడిచాడు.

'టీ'కి అతను ఆఫర్ చేయబోతుంటే 'ఇప్పుడే తాగాను' చెప్పాడు సుందరం. అతడికి తన అవసరం గురించి ఎలా ప్రారంభించాలో పాలుపోవడం లేదు. 'తెగించేయాలి' అనుకున్నాడు. అవసరం తనది కదా!

"కుమార్. నువ్వే సాయం చేయాలి. ఒక యాభై వుంటే ఇస్తావా? రేపీ పాటికి ఇచ్చేస్తాను" అన్నాడు.

"ఎందుకు?" అని కుమార్ అడక్కుండా వుంటే బాగుండును అనుకున్నాడు. కుమార్ అలా అడగాలని వుంటే ఎన్ననుకుని ఏం లాభం? ఒక్క క్షణం... ఒకే క్షణం ఆలోచించాడు సోమసుందర్.

కుమార్‌కి లాటరీ ఆడే అలవాటు లేదు. బుద్ధిమంతుడు. అయితే కన్విన్స్ చేస్తే అప్పటికి ఎలా చెప్తే అలా వినే అవకాశం ఎంతైనా వుంది.

"కుమార్! డొంక తిరుగుడెందుకు? లాటరీ ఆడటానికేనోయ్... అబ్బే! అట్లా అని లాటరీకి తగలబెట్టేస్తానసుకుంటున్నావా. సైంటిఫిక్‌గా ఆలోచించే వుంచాను, నంబరు. ఒకటికి ఎనిమిది రెట్లు. నీ కళ్ళ ముందే ఎలా పైసలురాల్తాయో చూద్దువుగాని"

"లాటరీకా? ఇంకెందుకయినా ఇస్తాను కానీ అందుకు మాత్రం అసలు ఇవ్వను" చెప్పాడు కుమార్.

"లాటరీ అంటే ఏంటనుకున్నావోయ్. ఇది మామూలు లాటరీ కాదు. సింగిల్ నెంబరు లాటరీ. ప్రతి పది మందిలో ఒకడికి ఖచ్చితంగా నంబరు తగులుతుందన్నమాట. నంబరు తగిలిందా రూపాయికి ఎనిమిది రూపాయలు చేతిలో వచ్చిపడతాయి. అంటే యాభై రూపాయలు పెట్టి టిక్కెట్స్ కొన్నావంటే నాలుగొందలు అలా చేతిలో వచ్చి పడతాయ్" నమ్మకంగా అన్నాడు సుందరం.

"వస్తాయని అంత గట్టిగా ఎలా చెప్తున్నావ్. యాభై రూపాయిలూ పోవచ్చుగా" సందేహం వెలిబుచ్చాడు కుమార్.

"అమ్మయ్య! గురుడు లైన్లోకి వచ్చేశాడు" అనుకుని "పోయే అవకాశం లేదు" అని జేబులోంచి ఓ కాగితం తీశాడు. అందులో అన్ని రకాల లాటరీల టేబుళ్ళు గీచి వున్నాయి. గడచిన రోజుల్లో ఏ రోజు ఏ నెంబరు వచ్చిందో అన్నీ అందులో వున్నాయి.

"చూశావా దీన్ని! ఛార్ట్ అంటారు. ఈ రోజు ఈ లాటరీలో ఏ నంబరు వస్తుందో టెక్నికల్‌గా అంచనా వేసేశాను. కళ్ళు మూసుకుని ఆ నంబరు మీద ఎంతైనా ఆడొచ్చు. డబ్బు పోవడానికి వీలే లేదు" అని ఎంతో నమ్మకంతో సుందరం చెప్పేసరికి ఎన్నడూ లాటరీల జోలికి పోని కుమార్ ఆలోచనలో పడ్డాడు. సుందరం యాభై అడుగుతున్నాడు. అతడికి యాభై ఇస్తే తన వద్ద ఇంకా ముప్పై రూపాయిలు మాత్రమే మిగులుతాయి. సుందరం, విడమర్చి చెప్పిన తర్వాత తప్పకుండా ఆ 'నంబరు' మీద లాటరీ ఆడాలనిపిస్తున్నది. కానీ వాడు యాభై ఆడితే నాలుగొందలు వస్తాయి. తనకేమో ముప్పై ఆడితే రెండు వందల నలభైరూపాయిలు మాత్రమే వస్తాయి. 'సొమ్మేమో నాది. సోకేమో ఆడిదా' అనుకుని "లాభం లేదు. సుందరం పాతిక రూపాయిలయితే ఇస్తాను. నాక్కూడా ఆడాలని వుంది" అన్నాడు.

దక్కిందే చాలనుకున్నాడు సోమసుందర్. పాతిక రూపాయలూ తీసుకున్నాడు. ఐదు రూపాయలు మాత్రం తన వద్ద వుంచుకుని మిగిలిన యాభై రూపాయలకూ సుందరం చెప్పిన నెంబరు టిక్కెట్లు తీశాడు. పదకొండు గంటలయ్యింది. మరో ఐదు నిమిషాలయ్యేసరికల్లా ఫోను ద్వారా 'డ్రా'లో ఏ నెంబరు తగిలిందో తెలిసిపోతుంది. మరుసటి రోజు పేపర్లో ప్రకటించేంతవరకూ ఎదురు చూడనక్కరలేకుండా లాటరీ యజమానులు చేసుకున్న ఒప్పందం అది.

పదకొండు గంటల ఐదు నిమిషాలవుతోంది. కుమార్ గుండె దడదడ కొట్టుకుంటున్నది. అవతల 'హౌరా' దడదడ శబ్దం చేస్తూ స్టేషనుకు చేరుకోవడం అతడికి విన్పించలేదు. టెన్షన్తో ముఖం చెమటలు కారుతున్నది. సుందరానికి అదేం లేదు. పెట్టింది తన డబ్బులు కాదాయె. అదీ గాక ఆ 'నంబరు' తగులుతుందన్న ఫుల్ గ్యారంటీ వుంది.

పదకొండు గంటల ఐదు నిమిషాలు దాటింది. వెంటనే వొచ్చింది వార్త. 'అదే నెంబరు!' ఇద్దరి ఆనందానికీ అవధులు లేకుండా పోయాయి. ఒకటా? రెండా? ఎనిమిది రెట్లు! కుమార్‌కి నాలుగొందల రూపాయిలు కళ్ళ ముందు మెదులుతున్నాయి.

డబ్బులివ్వమని లాటరీ అతన్ని అడిగారిద్దరూ. అతను "ఉండవయ్యా! నంబరు ఇంకా కన్‌ఫామ్ కాలేదు" అని విసుక్కున్నాడు. మరో ఐదు నిమిషాలకి అసలు నెంబరు వచ్చిందంటూ బోర్డు మీద రాశారు. కొత్త నంబరు! వేరే నంబరు!!

ఇద్దరి ముఖాల్లో రక్తం ఇంకిపోయింది! కుమార్‌కయితే నక్షత్రాలే కనిపిస్తున్నాయి ఎటు చూసినా.

◇

వార్తే కాదు

మనిషి చచ్చాడంటే
నాకు నవ్వు వస్తుంది-
మనిషి పుట్టాక
చచ్చేవరకూ
చస్తూనే వున్నాడు-
కులం చంపుతోంది
కలం చంపుతోంది
మతం చంపుతోంది
మనసు చంపుతోంది
డబ్బు చంపుతోంది
జబ్బు చంపుతోంది
ఆకలి చంపుతోంది
ఆశ చంపుతోంది
మనిషి చావడం
వార్త కాదే!



— చిమ్మపూడి శ్రీరామమూర్తి

